## కుల గణనను మళ్లీ చేపట్టాలి



మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చేసినటువంటి కుల గణనను రద్దుచేసి తిరిగి మళ్లీ బీసీ జన కుల గణనను చేపట్టాలి. కుల గణన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ప్రజలను మోసం చేసింది. కుల గణనను శాస్త్రీయంగా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణన తప్పుల తడకగా ఉంది. గత ప్రభుత్వాలు చేసిన లెక్కల ప్రకారం పోలిస్తే బీసీలను ఇప్పుడు తక్కువ చేసి చూపిస్తున్నారు. ఇదే సమయంలో ఓసీల జనాభా పెరిగినట్లు చూపిస్తున్నారు. దీని వెనక పెద్ద కుట్ర దాగి ఉందన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా అగ్రవర్ణాల ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నది. మళ్లీ సమగ్రంగా బీసీ కులగణన జరిపించాలి. అదికూడా శాస్త్రీయంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వాస్తవ లెక్కలు బయటపెట్టి ప్రభుత్వానికి బీసీలపై ఉన్న నిబద్ధతను నిరూపించుకోవాలి.

**- నరెడ్ల శ్రీనివాస్, బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు**


## 21 లక్షల బీసీలు ఏమయ్యారు?



ఇచ్చోడ, ఫిబ్రవరి 5 : బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేనే నిజం. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ కుల గణన సర్వేలో 21 లక్షల మంది బీసీలు ఏమయ్యారు. బీసీల గణనను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల తడకగా రూపొందించింది. ఎన్యుమరేటర్లు అరకొర సమాచారం సేకరించారు. ప్రభుత్వం ముందస్తుగానే కులం వివరాలు చెప్పకపోయిన పర్వాలేదంది. దీంతో బీసీల సంఖ్య తక్కువ వస్తుందని అనుమానం.

**- బలగం రవికుమార్, గేర్జం, బీసీ నాయకుడు**

# చేతులెత్తేశారు..




## బీసీ కుల గణనపై అనుమానాలు



ఇచ్చోడ, ఫిబ్రవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ జనాభా గణనలో ఇటీవల విడుదల చేసిన నివేదికపై అనుమానాలు ఉన్నాయి. గ్రామ, మండల స్థాయిలో కులగణన సక్రమంగా జరగలేదు. తప్పుడు సర్వేతో బీసీలు నష్టపోతున్నారు. తాజాగా ప్రభుత్వం వెల్లడించిన కుల గణన సర్వే జాబితా తప్పుల తడకగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి సర్వే నిర్వహించి కచ్చితమైన సంఖ్య ప్రకటించాలి.

**- ఎర్రగొల్ల రాజన్న యాదవ్, సిరికొండ**



- ఎన్నికలకు ముందు 42 శాతం రిజర్వేషన్లు అంటూ హామీ
- ఇప్పుడేమో కేంద్ర ప్రభుత్వం సమ్మతించాలంటూ మెలిక
- బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే అంశంపై సందిగ్ధం
- రాహుల్‌గాంధీ ఇచ్చిన డిక్లరేషన్ హామీ అబద్ధమేనా?
- కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు అంటూ మండిపాటు
- మాకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదంటున్న బీసీలు

మంచిర్యాల, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణలోని బీసీలకు అధికార కాంగ్రెస్ పార్టీ ఘోరంగా మోసం చేసింది. ఎన్నికలకు ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ రాహుల్‌గాంధీ సమక్షంలోనే బీసీ డిక్లరేషన్ చేసింది. కానీ.. అన్ని హామీల మాదిరిగానే బీసీలకు ఇచ్చిన మాటపై నాలుక మడతేసింది. రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పిస్తామని గెలిచిన నాటి నుంచి ఊరించి ఇప్పుడు ఉసూరు మనిపించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని, ఒప్పుకుంటే అమలు చేస్తామంటూ చేతులు ఎత్తేసింది. కేంద్రం ఆమోదించకపోతే పార్టీ పరంగా రిజర్వేషన్ల వాటా కల్పిస్తామంటూ సీఎం అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వంపైకి నెట్టి చేతులు దులుపుకుంది. దీనిపై బీసీ సంఘాల నాయకులు భగ్గుమంటున్నారు. రాహుల్‌గాంధీ చెప్పింది అబద్ధమేనా? అని మండిపడుతున్నారు. రైతు బంధు, రైతుభరోసా విషయంలో రైతులను మోసం చేసినట్లే బీసీలను మోసం చేస్తుందంటూ ఆరోపిస్తున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ బూటకమేనని అంటున్నారు.

### పార్టీ పరంగా వాటాతో ఒరిగేదేం లేదు

మొన్నటి వరకు రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి.. ఇప్పుడు పార్టీ పరంగా వాటాకు సిద్ధమని కాంగ్రెస్ పార్టీ చెప్తున్నది. కానీ.. దానితో ఒరిగేదేం లేదని బీసీ సంఘాలు అంటున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చట్టబద్ధత కల్పించకుండా పార్టీ పరంగా వాటా ఇస్తామనడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ ఎన్నికల్లో వాటా కల్పిస్తారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే తరహాలో కాంగ్రెస్ పార్టీ నుంచి వాటా ఇస్తారా? అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇస్తారా? చెప్పాలంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలను వాడుకుని లబ్ధిపొందడం కోసమే ఈ నాటకం ఆడుతున్నారంటున్నారు. అదే 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పిస్తే అసెంబ్లీ నుంచి పార్లమెంట్ దాకా మాకు రావాల్సిన వాటా వస్తుందంటున్నారు. జనగణన ఇంటింటి సర్వే తప్పుల తడకగా ఉన్నందుకే రిజర్వేషన్ విషయంపై ధైర్యం చేయలేకపోతుందని ఆరోపిస్తున్నారు. ఈ తప్పుడు లెక్కలే ప్రామాణికమని చెప్పకనే చెప్పుకుంటూ.. బీసీల నుంచి వ్యతిరేకత రాకుండా తప్పించుకునేందుకే కేంద్రం పైకి నెపం నెడుతున్నారని అభిప్రాయపడుతున్నారు. ఈ కులగణన లెక్కలు, అసెంబ్లీ తీర్మానాలను బీసీలెవరూ హర్షించడం లేదంటున్నారు. అమలు సాధ్యం కాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేదే లేదని బీసీ సంఘాలు, నాయకులు హెచ్చరిస్తున్నారు.

## బీసీలను అణగదొక్కేందుకు రేవంత్ ప్రభుత్వం కుట్ర



కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన బీసీ కులగణన సర్వే రిపోర్టు పూర్తిగా బూటకపు సర్వేగా అభివర్ణిస్తున్నాం. 2014 సమగ్ర కుటుంబ సర్వేలో 51 శాతంగా ఉన్న బీసీల సంఖ్యను ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేయించిన సర్వేలో బీసీలు 46 శాతానికి కుదించడం దుర్మార్గమైన చర్య. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ సర్వే ఫలితాలు పూర్తిగా అశాస్త్రీయంగా లోపభూయిష్టంగా ఉన్నాయి. అగ్రకులాల సంఖ్యను రెట్టింపు చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీల సంఖ్యను గణనీయంగా తగ్గించి చూపడం హేయమైన చర్య. తెలంగాణలో సర్వేను సమగ్రంగా చేయని కాంగ్రెస్ దేశవ్యాప్తంగా సర్వే చేస్తామంటే నమ్మడం ఎలా ? గత పదేళ్లలో పెరిగే అవకాశాలున్న బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా సంఖ్యని తగ్గించి చూపించారు. అణగారిన వెనుబడిన వర్గాలకు రిజర్వేషన్లు కుదించి అగ్రకులాలకు రిజర్వేషన్లు పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. బీసీలకు రాజ్యాంగ పరంగా రావాల్సిన హక్కులను హరించేందుకు ప్రభుత్వం చేసే కుట్ర ఈ సర్వేలో దాగున్నదని తెలుస్తున్నది. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన నిర్లక్ష్యానికి ఈ సర్వేనే సాక్ష్యంగా నిలుస్తున్నది.

**- రూపునర్ రమేశ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా**

## బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ జన గణన పేరిట బీసీ వర్గాలను మోసం చేసింది. పూర్తిస్థాయిలో సర్వేచేయకుండానే కుల గణన పూర్తయిందని చెప్పడం విడ్డూరంగా ఉంది. కుల గణనలో తప్పుల తడకగా ఉంది. కేవలం 42 శాతం మాత్రమే బీసీలు ఉన్నట్లు పేర్కొనడం వెనక ఆంతర్యం ఏమిటన్నది అర్థం కావడం లేదు. దాదాపు 52 శాతం బీసీలు, ముస్లిం బీసీల జనాభా దాదాపు 10శాతం కలుపుకుని రాష్ట్రంలో మొత్తం బీసీ జనాభా 60 శాతానికి పైగా ఉంటుంది. కానీ ప్రభుత్వం అసెంబ్లీలో చెప్పిన లెక్కల ప్రకారం బీసీ జనాభా భారీగా తగ్గిందని, ఓసీ జనాభా పెరిగిందని చూపించారు. దీనిపై ప్రజానీకం అనుమానాలు వ్యక్తం చేస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం పారదర్శకంగా సర్వేను నిర్వహించి ప్రజలకు వివరాలను వెల్లడించాలి. ఎన్నికలకు ముందు బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రిజర్వేషన్ల అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చేతిలోకి నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నది. బీఆర్ఎస్ చేపట్టిన ఇంటింటి సర్వేను పక్కన పెట్టి కొత్తగా సర్వే చేశామని చెప్పి బీసీ ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నది.

**- పెంట రాజయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్, మంచిర్యాల**



మంచిర్యాల ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

# ఆర్టీసీ కార్మికుల నిరసన

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 5: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం మంచిర్యాల ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొని ఆర్టీసీకి ఇవ్వాలని, 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలని, 2017 వేతన సవరణ బకాయిలు, డీఏ బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీసు విషయంలో రాష్ట్ర జేఏసీ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఈ నిరసనలో మంచిర్యాల డిపో జేఏసీ కన్వీనర్ గోలి శంకర్, కో కన్వీనర్ సేని తిరుపతి, రాష్ట్ర నాయకులు బొట్టు లక్ష్మణ్, రాజ్‌కుమార్, లింగయ్య, పీ తిరుపతి, జ్యోతి, శారద, మాధవి, సుజాత, కార్మికులు, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఒత్తిడికి గురికాకుండా చదవాలి

- 'పది' పరీక్షలకు ప్రణాళికతో సన్నద్ధమవ్వాలి
- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 5: పదో తరగతి వార్షిక పరీక్షలపై ఒత్తిడికి గురికావద్దని, ప్రణాళికా బద్ధంగా, ఏకాగ్రతతో చదవాలని విద్యార్థులకు కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో రైతు వేదికలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖల వసతి గృహాల్లో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. 10వ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రంలో జిల్లాను ముందంజలో నిలపాలన్నారు. మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరీక్షలకు ఇంకా 45 రోజులు మాత్రమే సమయం ఉందని తెలిపారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అదనపు తరగతులు నిర్వహించి పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేశ్, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ, మున్సిపల్, సంక్షేమం, జిల్లా పరిషత్, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, ఐసీడీఎస్. శాఖల అధికారులు, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 1,67,000 మంది పిల్లలకు ఈ నెల 10న ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నట్లు తెలిపారు. ఆ రోజున అందని వారికి ఈ నెల 17న అందిస్తామని చెప్పారు. 2 సంవత్సరాల్లోపు వయసు గల పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 19 వయసు గల పిల్లలకు ఒక మాత్ర చొప్పున అందించాలన్నారు. మాత్రలు వేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాం, డీపీవో భిక్షపతి గౌడ్, జడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# మావోయిస్టులు అజ్ఞాతం వీడాలి

**రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్**

బెల్లంపల్లి. ఫిబ్రవరి 5 : మావోయిస్టులు అజ్ఞాతం వీడి.. జనజీవన స్రవంతిలో రావాలని రామగుండం సీపీ శ్రీనివాస్ సూచించారు. బుధవారం బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన జాడి భాగ్య అలియాస్ పుష్ప, జాడి వెంకటి మావోయిస్టు దంపతుల తల్లి మల్లమ్మతో పాటు కుటుంబసభ్యులను మంచిర్యాల డీసీపీ భాస్కర్‌తో కలిసి సీపీ శ్రీనివాస్ పరామర్శించారు. ఆరోగ్య, ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఏదైనా ఆరోగ్య సమస్య ఏర్పడితే వైద్య చికిత్స అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పుష్ప లొంగిపోయేలా చూడాలని ఆమె తల్లి మల్లమ్మ, అన్న ఆవుల గంగారాంను కోరారు. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి వస్తే వారిపై ఉన్న రివార్డులతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత రోజుల్లో మావోయిస్టులకు ప్రజాదరణ తగ్గిందని, ఇటీవల జరిగిన పోలీసుల కాల్పుల్లో చాలామంది హతమయ్యారని తెలిపారు. ఇకనైనా పుష్ప అజ్ఞాతం వీడి జనంలోకి రావాలని, ఎన్నో ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో పని చేసి సాధించింది శూన్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ పాల్గొన్నారు.



మావోయిస్టు పుష్ప తల్లి మల్లమ్మతో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్



పారుపల్లిలో జిన్నింగ్ మిల్లు యజమానితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

# పత్తి రైతులకు ఇబ్బంది కలిగించవద్దు

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

కోటపల్లి, ఫిబ్రవరి 5 : సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద పత్తి కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బంది కలిగించవద్దని, మిల్లుల వద్ద మౌలిక వసతులు కల్పించాలని అధికారులు, జిన్నింగ్ మిల్లు నిర్వాహకులను మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. కోటపల్లి మండలంలోని పారుపల్లి గ్రామం సమీపంలోని నవదుర్గా జిన్నింగ్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. జిన్నింగ్ మిల్లు నిర్వాహకులతో మాట్లాడారు. సీసీఐ కేంద్రాల్లో ఉన్న పత్తిని తరలించేందుకు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని, జిన్నింగ్ మిల్లుల వద్ద రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని, వారికి నీడ, నీరు, మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. పత్తిలో 8 శాతం తేమ మించకుండా తీసుకురావాలని రైతులకు సూచించారు. మద్దతు ధర రావాలంటే తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలు పాటించాలన్నారు.

# 'డ్రంక్ అండ్ డ్రైవ్'ను కట్టడి చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 5: జిల్లాలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిని కట్టడి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో బుధవారం జిల్లా పోలీస్ అధికారులకు బ్రీత్ ఎనలైజర్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా వాహనాల తనిఖీల సమయంలో ఈ ఆధునిక బ్రీత్ ఎనలైజర్లు ఉపయోగపడుతాయని తెలిపారు. జిల్లాలో మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమయ్యే వారిని బ్రీత్ ఎనలైజర్ పరికరాలతో కట్టడి చేయవచ్చని తెలిపారు.



బ్రీత్ ఎనలైజర్లు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు





